కర్నూలు | నంద్యాల
వార్త
18 నవంబర్ 2025 మంగళవారం పేజీలు 4

# టిడ్కో గృహాలను అందజేస్తాం: మంత్రి టీజీ భారత్

**: జగన్నాథగట్టు కాలనీలో 187 మందికి గృహాలు పంపిణీ**

**కర్నూల్ హాస్పిటల్ నవంబర్ 17 ప్రభాతవార్త :** జగన్నాథగట్టు టిడ్కో గృహ సముదాయంలో 187 మందికి గృహాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భారత్ అందజేశారు. లబ్ధిదారులకు తప్పకుండా టిడ్కో గృహాలు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గృహాలను పరిశీలించిన మంత్రి, అవసరమైన అన్ని వసతులు అందిస్తామని చెప్పారు. పోలీస్ ఔట్‌పోస్ట్, ఆర్టీసీ సౌకర్యాలు, హాస్పిటల్ వంటి సదుపాయాలు త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని, భారీ పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. అభివృద్ధి-సంక్షేమం కలగలిపి పనిచేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు ఆశీర్వాదంగా నిలుస్తారని మంత్రి టీజీ భారత్ పేర్కొన్నారు.



# సీసీఎల్ సదస్సులో కర్నూలుకు ప్రాధాన్యత

**: చంద్రబాబు, లోకేష్‌కు కృతజ్ఞతలు**

**కర్నూలు హాస్పిటల్ నవంబర్ 17 ప్రభాతవార్త :** విశాఖపట్నంలో జరిగిన సీసీఎల్ భాగస్వామ్య సదస్సులో ఉమ్మడి కర్నూలు జిల్లాకు డ్రోన్ హబ్‌తో పాటు పలు పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పి. తిక్కారెడ్డి, టిడిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమల రాక, పెట్టుబడుల సాధనలో చంద్రబాబు నిరంతరంగా కృషి చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని తప్పు నిర్ణయాల కారణంగా పరిశ్రమలు రాష్ట్రం విడిచి వెళ్లిపోయినా, ఇప్పుడు విశాఖ సదస్సు ద్వారా తిరిగి పెట్టుబడుల రాక ప్రారంభమైందని అన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కర్నూలు జిల్లా యువతకు పరిశ్రమలు అత్యవసరమని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ సదస్సు ద్వారా ఆ హామీ అమలు దిశగా ముందడుగు పడిందని తెలిపారు. రాయలసీమ, కోస్తా ఆంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల సమానాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి. సంజీవలక్ష్మి, కె. నాగేంద్రకుమార్, పి. రవికుమార్, జె. పుల్లయ్య, డా. కె.వి. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కార్తిక సోమవారంతో.. కిక్కిరిసిన.. శ్రీశైలం..!





**శ్రీశైలంప్రాజెక్టు, నవంబరు17, ప్రభాతవార్త** కార్తిక నాల్గవ సోమవారంతో శ్రీశైలం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు వేకువజామునుండే అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు. అలాగే వేకువజాము నుంచే భక్తులు పాతళగంగలో పుణ్యస్నానాలాచరించుకోని శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనార్థమై చేరుకున్నారు. కార్తికమాసంలో ప్రభుత్వ సెలవుదినాలు, కార్తిక సోమవారాలు మరియు కార్తికపౌర్ణమి రోజులలో భక్తులు అదిక సంఖ్యాలో క్షేత్రానికి చేరుకోవడం జరిగింది. భక్తులందరు సంతృప్తికరంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది.

**దర్శనం ఏర్పాట్లు:** వేకువజామున 3గంటలకు ఆలయ ద్వారాలు తేరచి ప్రాత:కాలసేవలను జరిపించిన అనంతరం వేకువజామున గం.4.30 నుంచి సాయంత్రం గం.4.00ల వరకు దర్శనాలను కొనసాగించడం జరిగింది. అదే విధంగా తిరిగి సాయంత్రం గం.5.30ల నుంచి దర్శనాలు కొనసాగుతున్నాయి. కార్తికమాస రద్దీరోజుల్లో శని, ఆది, సోమవారాలు కార్తికమాసంలో మొత్తం 16 రోజులు స్వామివారి స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేసారు. రద్దీ రోజులలో సామూహిక ఆర్జిత అభిషేకాలను కూడా నిలుపుదల చేయడం జరిగింది.

**సిబ్బందికి ప్రత్యేక విధులు:** భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకై దేవస్థానం శాఖాధిపతులకు, పర్యవేక్షకులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించారు.

**క్యూలైన్లలో అల్పాహారం:** కార్తికమాసమంతా క్యూకాంప్లేక్స్ లో వేచిఉండే భక్తులకు ఉదయం నుంచే వేడిపాలను, అల్పాహారంగా పులిహోరా, పెరుగన్నం కట్టపొంగలి, మంచినీరు మరియు బిస్కేట్లు అందజేస్తున్నారు.

**కార్తిక దీపోత్సవం:** భక్తులు కార్తికదీపారాదన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీది మరియు గంగధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది.

**అన్నప్రసాద వితరణ:** భక్తులకు అన్నప్రసాద వితరణ భవనములో ఉదయం 10:30 నుండి అన్నప్రసాదాల వితరణ చేయడం జరుగుతుంది. సాయంత్రం గం.6:30ల నుంచి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసారు.

**లడ్డు ప్రసాదాలు:** కార్తికమాసంలో వచ్చే బక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకోని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేసారు. మొత్తం 10 కౌంటర్ల ద్వారా ప్రసాదాలు అందజేసారు.







# విచారణ చేసి.. న్యాయం చేస్తాం

**: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**
**: పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 84 ఫిర్యాదులు**

**కర్నూలు, నవంబర్ 17, ప్రభాతవార్త :** కర్నూలు కొత్తపేటలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వయంగా స్వీకరించి, త్వరితగతిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ప్రజల నుంచి మొత్తం 84 ఫిర్యాదులు అందాయని, ప్రతీ ఫిర్యాదుపైనా చట్టబద్ధంగా విచారణ జరిపి న్యాయం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి వినిపించారు. వచ్చిన ఫిర్యాదుల్లో ముఖ్యంగా సైబర్ మోసాలు, ఉద్యోగ పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేయడం, భూమి కొనుగోలు మోసాలు, కుటుంబ సభ్యుల నుండి వేధింపులు, చిన్న గొడవలపై దాడులు వంటి అంశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి ఫిర్యాదును సంబంధిత విభాగాలకు తక్షణమే పంపించి, త్వరితగతిన విచారణ చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. బాధితులకు న్యాయం చేయడం పోలీసు విభాగం ధర్మమని, ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సిఐలు రామకృష్ణ, ఇబ్రహీం పాల్గొన్నారు.



# జంట ఆత్మహత్యపై.. అనుమానం..!

**: డోన్‌లో సంచలనం రేపిన మట్కా ఫరీద్ ఆత్మహత్య**
**: మహిళతోపాటు అదే ఇంట్లో ఇద్దరి మృతదేహాలు**
**: జంట ఆత్మహత్యలపై సర్వత్ర అనుమానం**

**డోన్ నవంబర్ 17 ప్రభాతవార్త :** డోన్ ప్రాంతంలో గత రెండు దశాబ్దాల కాలంగా మట్కా ఫరీద్ గా పేరొందిన ఫరీద్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి డోన్ పట్టణంలో సంచలనం రేపింది. పట్టణంలోని రాజా టాకీస్ వెనుక మంచాల వీధిలో నివాసం ఉంటున్న అశ్విని అనే మహిళ ఇంట్లో ఆమెతో పాటు ఫరీద్ జంట మృతదేహాలు రాత్రి 7 గంటలకు కనుగొన్నారు... అశ్వినికి ఫరీద్ కు వివాహేతర సంబంధం ఉండేదని అయితే ఇరువురి మధ్య మనస్పర్ధలు వచ్చాయా లేక కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారా అన్నవి సరైన కారణాలు ఇప్పటివరకు తెలియ రాలేదు. అయితే ఫరీద్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.. అశ్వినికి భర్త కుటుంబము ఉందని కూడా తెలిసింది అశ్విని భర్త వెంకట్ నాయన పల్లి రోడ్డులో స్కూల్ వద్ద కిరాణం షాపు నిర్వహిస్తున్నారు... ఎంతకు ఫోన్ చేసినా రెస్పాన్స్ రాకపోవడంతో ఇంటికి వచ్చి చూస్తే ఇద్దరి మృతదేహాలు ఇంట్లోనే పడి ఉన్నట్లు అశ్విని భర్త పోలీసులకు సమాచారం అందించారు.. ఏది ఏమైనాప్పటికీ మట్కా ఫరీద్ గా డోన్ పట్టణ ప్రజలకు సుపరిచితుడైన ఫరీద్ ఆత్మహత్య చేసుకున్నారు అన్న వార్త పట్టణంలో ధావానలంలా వ్యాపించింది... మట్కా ఫరీద్ పై రౌడీషీట్ కూడా డోన్ పట్టణంలో నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఇరువురి ఆత్మహత్యకు గల కారణాలు ప్రాథమికంగా తెలియ రానప్పటికీ ఇద్దరి మృతదేహాలు కొద్దిగా కాలినట్టుగా ఉండడంతో ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఉద్దేశపూర్వకంగా హత్యా ప్రయత్నం జరిగిందా అన్నది కూడా తెలియాల్సి ఉంది... పోలీసులు అన్ని కునాల్లో దర్యాప్తును ప్రారంభించి ప్రజల్లో నెలకొన్న సందేహాలకు నివృత్తిని కలిగించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.





# అరికేర అంబేద్కర్ గురుకులంలో అవకతవకలు ఆరోపణలు

**- హాస్టల్ పరిస్థితి అధ్వాన్నం**


2లో

**ఆలూరు, నవంబరు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అరికేర డాక్టర .బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలుర వసతి గృహంలో చాల అవకతవకలు వెలుగోకి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్ళలో పిల్లల అగచాట్లు, ఉపాధ్యాయుల అనుచిత ప్రవర్తన బలవంతపు పనులపై ఆరోపణలు హాట్ టాపిక్‌గా మారాయి...

# పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు మిగులు గ్రీన్ పవర్‌ను నిల్వ చేయడంలో కీలక పాత్ర

**: దేశవ్యాప్తంగా 224 గిగా వాట్ సామర్థ్య ప్రాజెక్టులు**
**: కేంద్రమంత్రి మనోహర్ లాల్**




**కర్నూలు నవంబర్ 17ప్రభాతవార్త ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా పిన్నాపురం లో పార్లమెంటు సభ్యుల సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈరోజు ఏర్పాటు చేసింది. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు (పీఎస్పీలు)పై దృష్టి సారించిన ఈ సమావేశానికి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ అధ్యక్షత వహించారు. దీనికి విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్, లోక్‌సభ మరియు రాజ్యసభ నుండి విద్యుత్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులు, విద్యుత్ మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యుత్ అథారిటీ ల నుండి సీనియర్ అధికారులు హాజరయ్యారు. సభ్యులను ఉద్దేశించి కేంద్ర విద్యుత్ మంత్రి మనోహర్ లాల్ మాట్లాడుతూ, భారతదేశం ప్రస్తుతం విద్యుత్ మిగులు దేశం అని, అయితే, పరిమిత సామర్థ్య సంబంధాల కారణంగా అదనపు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం తక్కువగా ఉపయోగించబడుతుందని అన్నారు. ఈ మిగులు గ్రీన్ పవర్‌ను నిల్వ చేయడం ద్వారా మరియు సౌరశక్తి లేని సమయాల్లో విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం ద్వారా పిఎస్పీ లు కీలక పాత్ర పోషించగలవని ఆయన నొక్కి చెప్పారు. పీఎస్పీ జలాశయాల నుండి బాష్పీభవన నష్టాల సమస్యపై..

• వివరాలు 2లో

# హరోం హర..పోటెత్తిన జనం..!

**మహానంది, నవంబరు 17, ప్రభాతవార్త:** మహానంది పుణ్యక్షేత్రంలో భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంలో వివిధ జిల్లాల నుండి భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకొని దేవస్థానం ఈవో శ్రీనివాసరెడ్డి, ఏఈ మధులు తెల్లవారుజాము నుండే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు అచరించిన తరువాత ప్రత్యేక క్యూలైన్ ద్వారా భక్తులు ఆలయంలోకి ప్రవేశించి శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తుల కోసం వినాయక నంది ఆలయం ఎదురుగా ఉచితంగా పాలను అందజేశారు. అలాగే భక్తుల కోసం నిరంతరాయంగా దేవస్థానం వారు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సామూహిక అభిషేకాలు, కార్తీక నోములు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సూపరింటెండెంట్‌లు శశిధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, టెంపుల ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య, జగదీశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పర వ్యవేక్షించారు.



# ప్రజా ఫిర్యాదులను.. నాణ్యతతో పరిష్కరించాలి

**: కలెక్టర్ డా.సిరిపిజిఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేయరాదు**
**: అన్ని శాఖలు సకాలంలో, నాణ్యతతో పరిష్కారం చూపాలి**

**కర్నూలు, నవంబర్ 17, ప్రభాతవార్త :** పిజిఆర్ఎస్‌లో నమోదైన ప్రజా అర్జీలను వేగవంతంగా, నాణ్యతతో పరిశీలించి పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులు గూర్చి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఎంతో కీలకమని, ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ అర్జీలపై సమీక్ష జరుపుతున్నందున, జిల్లా అధికారులు తమ తమ శాఖల పరిధిలో ఉన్న పెండింగ్ అర్జీలను త్వరితగతిన క్లియర్ చేయాలని ఆమె ఆదేశించారు. అర్జీలపై స్పష్టమైన ఎండార్స్మెంట్లు ఇచ్చి వాట్సప్ ద్వారా అర్జీదారులకు పంపించాలని, అలాగే పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌లపై ఆడిట్‌ను నిరంతరంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, అనూరాధ తదితర అధికారులు పాల్గొన్నారు.



సిఎంఓ అర్జీలపై కలెక్టర్ నేరుగా ఫోన్ కాల్స్ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన అర్జీలలో రీఓపెన్ అయిన సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సోమవారం నేరుగా అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యల వివరాలు తెలుసుకున్నారు. రీ ఓపెన్ అయిన అర్జీలను తనిఖీ చేస్తూ అర్జీదారులను వివరంగా ప్రశ్నించారు. అర్జీదారులతో మాట్లాడుతూ.. వారి సమస్య ఏమిటి, సంబంధిత అధికారులు మాట్లాడారా, ఎండార్స్మెంట్‌ను అధికారుల నంబర్ నుంచి వాట్సాప్‌లో పంపించారా, భూమికి సంబంధించిన సమస్య అయితే ఫీల్డ్ విజిట్ జరిగిందా, సమస్య పరిష్కారం లేకుండా తిరగదోడిస్తున్నారా వంటి అంశాలను కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు.

# రోడ్డుపై.. విద్యుత్ స్థంభం..!

**: పట్టించుకోని విద్యుత్ అధికారులు**

**ఆలూరు, నవంబరు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మొలగవెల్లి గ్రామంలో బస్టాండ్ నుండి చెరువు కట్ట వైపు గ్రామంలోకి వెళ్ళే ప్రధాన రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంభం ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం విద్యుత్ అధికారులకు స్థంభాన్ని తొలగించమని వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడంలేదని స్తానికులు ఆరోపించారు. స్థంభం మధ్యలో ఉండడం వలన ప్రస్తుతం సీసీ రోడు వేస్తుండడంతో తీవ్ర ఇబ్బందిగా ఉందని.. విద్యుత్ అధికారులు స్పంధించడం లేదని గ్రామ సర్పంచ్ మోహన్‌రాజ్, ఎంపిటిసి సునంద పటేల్ యాదవ్‌లు తెలిపారు.






# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


2లో

# పగిడ్యాలలో 27యేళ్లుగా కార్తీకమాసంతో బన్నూరు వంశస్తులు అన్నధానం



**పగిడ్యాల, నవంబరు 17, ప్రభాతవార్త :** తల్లిదండ్రుల బాటలో వారి కుమారులు 27 సంవత్సరాలుగా కార్తీకమాసం సోమవారం అన్నధానం చేస్తూవస్తున్నారు. నంద్యాల జిల్లా మండల కేంద్రమైన పగిడ్యాలలో బన్నూరు వంశస్తులు. కార్తీకమాసం చివరి సోమవారం పగిడ్యాల బంగ్లా సర్వేశ్వరుణి శివాలయ ప్రదేశంలో అన్నధానం చేశారు ఆలయంలో బీరవోలు గ్రామానికి చెందిన దుర్గం వివేక్‌వర్ధన్‌రెడ్డి, సవీరారెడ్డి దంపతులు అభిషేకం ప్రతేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. 1999వ సంవత్సరంలో అన్నధానం చేసేందుకు బన్నూరు వంశస్తులు శ్రీకారం చుట్టారు. పగిడ్యాల మాజీ సర్పంచ్ కీ.శే.బన్నూరు సుబ్బారెడ్డి, కీ.శే.బన్నూరు శివారెడ్డి, కీ.శే.బన్నూరు వెంకటరెడ్డి, కీ.శే.బన్నూరు రామ కృష్ణారెడ్డి, కీ.శే.నారాయణరెడ్డి, కీ.శే.రామ చంద్రారెడ్డి, కీ శే.యుగంధరెడ్డి మృతి చెందారు. అయినా తల్లిదండ్రులు ప్రారంభించిన కార్యక్రమాన్ని వారి కుమారులు కార్తీకమాసం చివరి సోమవారం అన్నదానం చేస్తూవస్తున్నారు. ప్రతి సంవత్సరం అన్నధానం చేయాలని 1999లో నిశ్చయించుకుని ఒక నిధిని ఏర్పాటు చేశారు. వారి తల్లిదండ్రులు మృతి చెందినా వారు ఏర్పాటు చేసిన నిధిద్వారా ప్రతి సంవత్సరం కార్తీకసమాసం ఆఖరి సోమవారం అన్నధానం చేయడం 27 యేళ్ళు కావస్తుంది. ఈ కార్యక్రమానికి సమీప గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొనడం అదేవిధంగా స్థానిక ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, ఆయా పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొనడం విశేషం, ఈ కార్యక్రమంలో ఎంఈఓ -2 మురళీమోహన్‌రెడ్డి, ఎంపిఓ మద్దిలేటి, ఎపిఎం కళావతి, జెడ్పీటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి, పగిడ్యాల సింగిల్ విండో చైర్మెన్ బొగ్గుల దామోదరరెడ్డి, మోడల్‌స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, జెడ్పీపాఠశాల హెచ్‌ఎం మధుసూధనరావు, టిడిపి నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, బన్నూరు వంశీయులు శ్రీధర్‌రెడ్డి, దేవోత్తమరెడ్డి, వేమారెడ్డి, మురళీధరెడ్డి, రాజశేఖరెడ్డి, చంద్రశేఖరెడ్డి, జయరామిరెడ్డి, చిన్నరాజశేఖరెడ్డి, బన్నూరు యస్వంత్‌రెడ్డి నందికొట్కూరు నందిజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్, సల్లా శివశంకరెడ్డి, పల్లె మురళీధరెడ్డి, గంగిరెడ్డి గారి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మిరెడ్డి, గంగిరెడ్డిగారి రమాదేవి. పుల్యాల నాగశేఖరెడ్డి, శివరామిరెడ్డి, బాబురెడ్డి, భూషిరెడ్డి,బోరెల్లి మహేశ్వరెడ్డి, బొబ్బిటి సత్యంరెడ్డి, వీర రమేష్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, గురివిరెడ్డి, శివానందభారతీస్వామిజీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా దామోదరెడ్డి, బన్నూరు వంశస్తులు, వారి ఆడపడుచులు, అల్లుల్లు, మనుమలు మనుమరాళ్లు గ్రామపెద్దలు, పారి శుద్ధ్యకార్మికులు, కావలికాల్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ఆదోని టౌన్, నవంబరు17, ప్రభాతవార్త;**



పట్టణంలోని ఆస్పరి రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ట్రాఫిక్ సీఐ అబ్దుల్‌గౌస్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎంఐజీ కాలనీకి చెందిన మాధవస్వామి(52) ఓ ప్రైవేట్ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇంటికి చేరుకుని భోజనం అనంతరం తిరిగి నారాయణ కాలేజీకి వెళ్తుండగా ఆస్పరి రోడ్డులోని బైపాస్ సమీపంలో మాధవస్వామి వెళ్తున్న సైకిల్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాధవస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య సుకన్య, కుమారుడు శ్రీనాథ్ బోరున విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ అబ్దుల్‌గౌస్ తెలిపారు.

# రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టండి

**హొళగుంద, నవంబరు17, ప్రభాతవార్త;**



మండలకేంద్రమైన హొళగుందలోని వాల్మీకి సర్కిల్ నుంచి బస్టాండు వరకు చేపడుతున్న రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని ఆర్‌అండ్‌బి డీఈ వెంకటేశ్వర్లు సుగుణ కన్స్ట్రక్షన్ మేనేజర్ రఘునాథ్‌రెడ్డికి సూచించారు. సోమవారం హొళగుందలోని మురళి రైస్ మిల్లు ముందు రోడ్డు నిర్మాణానికై డీఈ, ఏఈలు సిబ్బందితో కలిసి కొలతలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూ.1.48 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపడతామన్నారు. అలాగే సినిమా రోడ్డులోని మన గ్రోమోర్ నుంచి కోగిలతోట రోడ్డు క్రాస్ వరకు 5.5 మీటర్లతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడతామన్నారు. గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిఒక్కరూ సహకరించాలని వారు కోరారు. అలాగే రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డుకు రూ.2.20 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. అలాగే ధణాపురం-హెబ్బటం వరకు 12 కి.మీ. రహదారికి రూ.7 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే హొళగుంద-హెబ్బటం రోడ్డుకు నిధులు మంజూరవుతాయని వారు పేర్కొన్నారు.

# అరికేర అంబేద్కర్ గురుకులంలో అవకతవకలు ఆరోపణలు

**(మొదటి పేజీ తరువాయి ) :** హాస్టళ్ళలో కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థులతో గొడ్డుచాకిరి చేయిస్తున్నారని ఆరోపణలు తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. పిల్లలకు అవసరం లేని పనులు చేయించడం, ఒత్తిపెట్టడం తరుచుగా జరుగుతా ఉందని వారు పేర్కొన్నారు. అదే సమయంలో ఆర్ట్ టీచర్ అచ్చయ్య ప్రవర్తనపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. గురుకుల లోపలే ఆయన సొంతంగా కిరాణా షాపు నడుపుతున్నట్లు విలేకర్లు గుర్తించగా దీనిపై ప్రశ్నించగానే విలేకర్లపై అసభ్య పదజాలం ఉపయోగించినట్లు సమాచారం. కిరాణం షాపు అనుమతి ఉందా...;? అచ్చయ్య..మేము స్పెషల్ టీచర్లు, 1985 జీవో ప్రకారం కిరాణం పెట్టుకోవచ్చు. డీసివో ఆదేశాల ప్రకారం అందరు నామాట వినాలి అంటు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. తల్లిదండ్రులు మాట్లాడుతు 1994-1999లో ఇక్కడ నేను చదివాను, ఇప్పుడు నా పిల్లలను చదివిస్తున్నాను. ప్రస్తుత టీచర్ల ప్రవర్తన చాల దారుణంగా ఉందని తెలిపారు. గతంలోనే డిసివోకు ఫిర్యాదు చేసినప్పటికి పరిస్థితిలో మర్పురాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది విద్యార్థులు కూడా ఆర్ట్ టీచర్ అచ్చయ్య తరుచు పిల్లల మధ్య వాగ్వాదాలు రేపుతు అవమానకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రిన్సిపాల్ మనోహార్‌రాజు వివరణ ఇస్తూ కిరాణం షాపు నడపడానికి తన అంగీకారం ఉన్నట్లు పేర్కొన్నట్లు తెలుస్తుంది. అరికే గురుకులంలో జరగుతున్న ఈ పరిణామాలపై, తల్లిదండ్రులు, స్తానికులు తీవ్ర ఆంధోళన వ్యక్తం చేస్తు సంభందిత ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు మిగులు గ్రీన్ పవర్‌ను నిల్వ చేయడంలో కీలక పాత్ర

**(మొదటి పేజీ తరువాయి ) :** ఆచరణీయ పరిష్కారంగా తెలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేయాలని మంత్రి సూచించారు. సకాలంలో స్థల కేటాయింపు, నీటి కేటాయింపు మరియు వేగవంతమైన అనుమతుల ద్వారా పీఎస్పీ అభివృద్ధిని సులభతరం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల కీలక పాత్రను ఆయన నొక్కి చెప్పారు. పీఎస్పీల అభివృద్ధిని వేగవంతం చేయడానికి గ్రీన్ ఎనర్జీ సెస్, నీటి పన్ను మరియు రిజర్వాయర్ లీజు ఫీజులు వంటి ఛార్జీలను ఉపసంహరించుకోవడం గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించాలని ఆయన కమిటీ సభ్యులను కోరారు.దేశవ్యాప్తంగా దాదాపు 224 జి డబ్ల్యూ పీఎస్పీ సామర్థ్యాన్ని గుర్తించినట్లు కమిటీ సభ్యులకు సమాచారం అందింది. వీటిలో, దాదాపు 7 జి డబ్ల్యూ మొత్తం సామర్థం కలిగిన పది పీఎస్పీలు ప్రారంభించబడ్డాయి, దాదాపు 12 జి డబ్ల్యూ సామర్థం కలిగిన మరో పది పీఎస్పీలు నిర్మాణంలో ఉన్నాయి మరియు దాదాపు 78 జి డబ్ల్యూ సామర్థం కలిగిన యాభై ఆరు పీఎస్పీలు ప్రణాళిక మరియు అభివృద్ధి యొక్క వివిధ దశలలో ఉన్నాయి.పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ (పీఎస్పీ) అభివృద్ధిని వేగవంతం చేయడానికి భారత ప్రభుత్వం చేపట్టిన కీలక విధాన కార్యక్రమాల గురించి సభ్యులకు వివరించారు. వీటిలో సైట్ కేటాయింపు కోసం విధానాలను వివరించే పీఎస్పీ అభివృద్ధికి మార్గదర్శకాల జారీ, ఉచిత విద్యుత్ మరియు స్థానిక ప్రాంత అభివృద్ధి నిధి బాధ్యతల నుండి మినహాయింపు మరియు 30.06.2028న లేదా అంతకు ముందు మంజూరు చేయబడిన ప్రాజెక్టులకు 25 సంవత్సరాల పాటు అంతర్‌రాష్ట్ర ప్రసార ఛార్జీలను పూర్తిగా మాఫీ చేయడం ఉన్నాయి. మౌలిక సదుపాయాలను ప్రారంభించడానికి ప్రభుత్వం బడ్జెట్ మద్దతును విస్తరించింది, ఇంధన నిల్వ వ్యవస్థల కోసం పునరుత్పాదక వినియోగ బాధ్యతలను నోటిఫై చేసింది మరియు పీఎస్పీల నుండి నిల్వ సామర్థం/నిల్వ చేయబడిన శక్తిని సేకరించడానికి టారిఫ్‌ఆధారిత పోటీ బిడ్డింగ్ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇంకా, ఆఫ్‌స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పీఎస్పీలను సీఈఏ సమ్మతి అవసరం నుండి మినహాయించారు. అదనంగా, హైడ్రో మరియు పీఎస్పీ ప్రాజెక్టులకు సీఈఏ సమ్మతి కోసం మూలధన వ్యయ పరిమితిని ..3,000 కోట్లకు సవరించారు, పోటీగా బిడ్ చేయబడిన ప్రాజెక్టులకు మునుపటి పరిమితి ..2,500 కోట్లు మరియు ఎంఓయు మార్గ ప్రాజెక్టులకు ..1,000 కోట్లు.విద్యుత్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యులు పిఎస్పీ లకు సమగ్ర విధాన ప్రోత్సాహాన్ని అందిస్తున్నందుకు విద్యుత్ మంత్రిత్వ శాఖను ప్రశంసించారు. ఆఫ్ స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పిఎస్పీ లకు సాంకేతిక మదింపు అవసరాలను సడలించడం, మౌలిక సదుపాయాలను ప్రారంభించడానికి బడ్జెట్ మద్దతు ద్వారా సాధ్యతను బలోపేతం చేయడం మరియు ఇఎస్టీఎస్ ఛార్జీల మాఫీ వంటి ఇటీవలి చర్యలు డెవలపర్లు మరియు రాష్ట్రాలలో విశ్వాసాన్ని గణనీయంగా మెరుగుపరిచాయని వారు గుర్తించారు.దేశవ్యాప్తంగా పీఎస్పీ ల అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కమిటీ సభ్యులు విలువైన సూచనలను అందించారు. పీఎస్పీల పర్యావరణ ప్రభావాలు మరియు పవన మరియు సౌర వంటి పునరుత్పాదక ఇంధన వనరులను కూడా కమిటీ చర్చించింది. వారు పీఎస్పీల ప్రయోజనాలను నొక్కిచెప్పారు, వాటి సాపేక్షంగా తక్కువ పర్యావరణ ప్రభావాన్ని హైలైట్ చేశారు.విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ కూడా కమిటీని ఉద్దేశించి ప్రసంగిస్తూ, 202526లో 1680 మెగావాట్ల పిన్నాపురం పిఎస్‌పిలోని ఎనిమిది యూనిట్లను 500 మెగావాట్ల టెహ్రీ పిఎస్‌పితో పాటు విజయవంతంగా ప్రారంభించడం కేంద్రం, రాష్ట్రాలు, సిపిఎస్‌యులు మరియు ప్రైవేట్ రంగం మధ్య బలమైన సమన్వయాన్ని ప్రతిబింబించే ప్రధాన జాతీయ విజయమని తెలియజేశారు.

# శివనామస్మరణతో మార్మోగిన బ్రహ్మగుండం

**వెల్దుర్తి, నవంబర్ 17, ప్రభాతవార్త :**



ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శైవక్షేత్రాలలో ఒకటైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బ్రహ్మగుండంలో కార్తీక మాస కడసోమవారం పురస్కరించుకొని భక్తులు ఎక్కువసంఖ్యలో హాజరై పవిత్ర కోనేరులో స్నానమాచరించి కామేశ్వరిదేవిసహిత బ్రహ్మేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మ వార్లకు అభిషేకం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఆలయ కమిటీ అధ్యక్షులు బొమ్మన రాజశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది మౌలికవసతులు కల్పించారు. గ్రామ పెద్దలు, ప్రముఖులు బ్రహ్మగుండానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య అన్నసత్రం ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటుచేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వెల్దుర్తి సర్కిల్ సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్సై నరేష్, ట్రైనీ ఎస్సై విద్యశ్రీ, పోలీస్‌సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు.

**- పశులోని దేవాలయంలో కార్తీకదీపాల కార్యక్రమం :** వెల్దుర్తి పట్టణంలోని పశులోని దేవాలయంలో గ్రామపెద్దలు,మాజీ ఎంపిపి బొమ్మనదశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో శివునికి అభిషేకంతోపాటు, ప్రత్యేకపూజలు చేశారు.భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.కార్తీకమాస కడసోమవారం పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీకదీపాలను ఓంకారంలో వెలిగించారు.

**- బొమ్మిరెడ్డిపల్లిలో భీమలింగేశ్వరస్వామి కళ్యాణం**

**- కార్తీకమాస వనభోజన కార్యక్రమ ఉత్సవాలు :** మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో జాతీయరహదారి ప్రక్కన కర్నూలు రోడ్డులో వెలసిన శ్రీ అన్నపూర్ణసమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో భీమలింగేశ్వరస్వామివార్ల కళ్యాణమహోత్సవం సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులు పూడురు లక్ష్మిరెడ్డి,నాగేశ్వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు.స్వామి వారికి అభిషేకాలు చేసి శ్రీ పార్వతిపరమేశ్వరుల లీలా కళ్యాణ మహోత్సవం వేదపండితుల మంత్రాల నడుమ నిర్వహించారు.భక్తులందరికి కార్తీకమాస వనభోజన (అన్నప్రసాద వితరణ)కార్యక్రమం ఏర్పాటుచేశారు.సాయంకాలం స్వామి వారి పల్లకిసేవ,జ్వాలాతోరణం,లక్షదీపోత్సవం మహా మంగళహారతి ,అల్పాహార వితరణ ఏర్పాటుచేశారు.

# చట్టాల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి



**ఆదోనిలీగల్, నవంబరు17, ప్రభాతవార్త;** ప్రతిఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ పేర్కొన్నారు. ఆదోని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బైచిగేరి గ్రామంలో జడ్జి అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు, సీనియర్ సిటీజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం 2007 గురించి న్యాయ విజ్ఞాన సదస్సు గురించి తెలియజేశారు. ఆస్తి తగాదాల గురించి, ప్రామిసరీ నోట్‌కు సంబంధించి క్రమినల్ కేసుల రాజీ గురించి లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం పొందవచ్చన్నారు. భార్యను భర్త సరిగా చూసుకోకపోతే కోర్టు ద్వారా భర్త నుంచి భరణం పొందే అవకాశం ఉందన్నారు. అలాగే వృద్ధుల ఆసరా కోసం ప్రభుత్వాలు పింఛన్లను అందిస్తాయన్నారు. చిన్నచిన్న విషయాలకే తగాదాలు చేసుకోకుండా గ్రామాల్లోని ప్రజలు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. న్యాయవాది ఎం.వి.లోకేష్‌కుమార్, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. ఈ సదస్సులో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తా..



**హాలహర్వి, నవంబరు17, ప్రభాతవార్త;** టీడీపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని టీడీపీ గ్రామ నూతన అధ్యక్షుడు డి.పి.గాదిలింగప్ప అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధిష్టానం గ్రామ అధ్యక్షుడిగా నియమించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ఆదర్శనీయమని కొనియాడారు. పార్టీ బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరీఈట్ట అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామన్నారు.

# యాగంటి క్షేత్రంలో కార్తీకసోమవారం ఉత్సవాలు

**- స్వామివారికి వెండికవచం బహుకరించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి**



**బనగానపల్లె, నవంబరు 17, ప్రభాతవార్తః** కార్తీక మాసం కడసోమవారం యాగంటి క్షేత్రంలో భక్తులతో కిక్కరిసింది. తెల్లవారుజాము నుండి వేలాది భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఉమా మహేశ్వరస్వామి వార్లకు వెండి కవచం బహుకరించారు. యాగంటి క్షేత్ర సమీపంలోని యాగంటి బసవన్న గోశాలలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయన సతీమణి కాటసాని జయమ్మ, అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగంటి బసవన్న గోశాల వద్ద కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర్గీయ కాటసాని నాగార్జున్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. వైసీపీ నాయకులు చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, బసవన్న గోశాల అధినేత గుర్రా వెంకటేశ్వర్లు, పాతపాడు వైసీపీ నాయకులు బెడదల చంద్రశేఖర్‌రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా కార్తీక కడసోమవారం ఉత్సవాలు

**బనగానపల్లె, నవంబరు 18, ప్రభాతవార్తః**



బనగానపల్లె మండలంలోని పసుపల గ్రామంలో వెలసిన శ్రీగుండం మల్లిఖార్జునస్వామి ఆలయంలో కార్తీక కడసోమవారం ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి శివచంద్ర ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న బీసీ రాజారెడ్డికి ఆలయ చైర్మన్ సిద్దేశ్వరప్ప ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం బీసీ రాజారెడ్డి శ్రీగుండం మల్లిఖార్జునస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శివచంద్రప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో మంత్రాలయంకుచెందిన శ్రీపండిత్ గౌతమి స్వామి బృందం వారు ఆలయంలో ఉదయం గణపతిహోమం రుద్రశ్రీలక్ష్మీనరసింహా నవగ్రహా మృత్యుజయ దన్వంతర సుదర్శనహోమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన రైతు సంబరాలను బీసీ రాజారెడ్డి ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు 20 ఏడ్ల జతలు రాగ పోటీలు హోరాహోరిగా సాగుతున్నాయి. పాటీల్లో పాల్గొంటున్న ఎద్దుల యజమానులకు బీసీ రాజారెడ్డిచేతుల మీదుగా శాలువకప్పి సత్కరించారు. శ్రీగుండం మల్లిఖార్జునస్వామి క్షేత్రం నందు శివచంద్ర ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో కార్తీక మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిచడం అభినందనీయమని బీసీ రాజారెడ్డి అన్నారు. ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. మహోత్సవాలకు విచ్చేసిన భక్తజనానికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం బోజనం ఏరాప్టు చేశారు. టీడీపీ నాయకులు కొండు భూషన్న, ఆలయ చైర్మన్ సిద్దేశ్వరప్ప, షేక్షావలి, బాలనాయుడు, మధుసూధన్‌నాయుడు, ఓబులేసు, తిరుపతినాయక్, భక్తులు పాల్గొన్నారు.

# పిల్లలు లేని తల్లిదండ్రులకు.. పిల్లల కొరత తీర్చడమే దత్తత లక్ష్యం..!



**ఆళ్లగడ్డ, నవంబరు 17, ప్రభాతవార్తః** పిల్లలు లేని తల్లిదండ్రులకు పిల్లల కొరత తీర్చడమే దత్తత ముఖ్య ఉద్దేశమని ఈ ఉద్దేశాన్ని జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని నంద్యాల జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సునిల్ కుమార్, సోషల్ వర్కర్ ఓబులమ్మలు తెలిపారు. సోమవారం స్థానిక సిడిపివో కార్యాలయంలో ప్రత్యేక దత్తత మాసోత్సవం సందర్భంగా సిడిపివో తేజేశ్వరి అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలకు, అయాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు నెలలో ప్రత్యేక దత్తత మసోత్సవాల సందర్భంగా జిల్లా పిడి అదేశాల మేరకు సిడిపివో అధ్యక్షతన జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దత్తత అనేది చట్టప్రకారంజరగాలని నంద్యాలలోని ప్రత్యేక దత్తత కేంద్రంలో చేర్చబడిన పిల్లలను నిజంగా పిల్లలులేని తల్లిదండ్రులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లదండ్రులు కేంద్రప్రభుత్వానికి రూ.50 వేలు డిడి రూపంలో చెల్లించాలని తెలిపారు. ఈఉద్దేశాన్ని జిల్లావ్యాప్తంగా అవగాహన కల్పించడం ప్రోగ్రామ్‌ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్కలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే సహించం



**తుగ్గలి, నవంబరు 17, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను దూరం చేస్తే సహించేది లేదని వైయస్సార్సీపి ఎస్సీ సెల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు జొన్నగిరి సుంకప్ప అన్నారు. సోమవారం జొన్నగిరి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మెడికల్ కాలేజి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతు వైయస్సార్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మాణం చేపట్టి పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిసి విధానంలోరి తీసుకువచ్చి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు మెరుగైన సేవలంధించి అక్కడ పడిన ఇబ్బందులను గుర్తించి జగనన్న అన్ని జిల్లాలలో ఒక్కొక్క మెడికల్ కాలేజి ఉండాలి ప్రతి పేద విద్యార్థి వైద్య విద్యను చదవాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తే నేటి కూటమి ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కి జగనన్న ఏమిచేయలేదని ప్రచారం చేస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వైసిపి నాయకులు రమేష్, ఆంజనేయులు, బి.రామన్న, రాజు తోపాటు పలువురు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువుల వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు

**- డిస్టిక్ట్ పొలంబడి ఎక్స్‌ట్రేనల్ ఇవాల్యుమేటర్ ఎ.రాధ**

**హొళగుంద, నవంబరు17, ప్రభాతవార్త;**



సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతో పాటు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని డిస్టిక్ట్ పొలంబడి ఎక్స్‌ట్రేనల్ ఇవాల్యుమేటర్ ఎ.రాధ అన్నారు. ఈ మేరకు సోమవారం హొళగుందలో వ్యవసాయ అధికారి ఆనంద్ లోకాదల్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండి జీఏపీ పొలంబడి ద్వారా రైతులు పురుగు మందులు తక్కువగా వాడి వరి పంటను పండించాలని రైతన్నలకు సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించం వల్ల ప్రజలు ప్రమాదాలబారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ విరుపాక్షి, వీఏఏ శివకృష్ణనాయక్, వీహెచ్‌ఏ రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు సిద్ధార్థగౌడ్, గవిసిద్దప్పప, జంబప్ప తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు : సీడీపీవో

**కోసిగి, నవంబరు 17, ప్రభాతవార్త :**




అంగన్‌వాడీ టీచర్లు విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐసిడిఎస్ మంత్రాలయం ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరీ హెచ్చరించారు. సోమవారం కోసిగిలోని 13వ అంగన్‌వాడీ కేంద్రంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో సమావేశం అయ్యారు. సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మిబాయి, కాత్యాయినీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరీ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పనిచేయాలన్నారు.. ముఖ్యంగా ప్రభుత్వం సూచిన మెనూ ప్రకారమే ప్రీస్కూల్ పిల్లలకు వంట చేసి భోజనం స్థానిక కేంద్రంలోనే తినిపించాలన్నారు.. అంతేకాక పోషణ ట్రాకర్ ఎపిపిలో అపార్డ ఐడి, అభా ఐడిలు 3-5 సంవత్సరాల పిల్లలకు ఈ-కేవైసి, ముఖ చిత్రం చేయాలన్నారు..ప్రధానమంత్రి మాతృవందన యోజనలో గర్భవతులను నమోదు చేయాలనన్నారు..తీవ్ర లోప పోషణ, అతి తీవ్ర లోప పోషణ పిల్లలకు గృహ సందర్శన చేసి తల్లులకు అవగాహన కల్పించాలన్నారు.. పప్పు, బియ్యం, ఆకుకూరలను కుక్కర్‌లో ఉడకబెట్టి, అందులో ఉప్పు, నెయ్యి కలిపి పిల్లలకు తినేలా చూడాలని సూచించారు..మరీ ముఖ్యంగా గర్భవతులకు, బాలింతలకు టేక్‌హోం రేషన్ అందేలా చూడాలని కోరారు..వీటి పట్ల ఎవరైన అలసత్వం ప్రదర్శించి నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కోసిగి మండలంలోని మూడు సెక్టర్ల అంగన్‌వాడీలు పాల్గొనారు..

# భారత్ స్కౌట్స్ గైడ్స్ జట్లు ఏర్పాటు

**నందికొట్కూరు, నవంబరు 17, ప్రభాతవార్త :**



మండల పరిదిలోని కొణిదేల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సర నూతన స్కౌట్స్ గైడ్స్ జట్లను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతు స్కౌట్స్ గైడ్స్ ఏర్పాటు వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ, సేవాబావం, పెంపొందుతాయని మానసికంగా బలంగా తయారు అవుతారని, అంతే కాక నాయకత్వ లక్షణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఇతరులకు సేవ చేసే గుణం అలవడుతుందన్నారు. పి.ఎమ్.శ్రీ పాఠశాలగా ఎంపిక కావడం వల్ల స్కౌట్స్ అండ్ గైడ్స్ టీమ్స్ కొరకు ప్రత్యేకంగా నిధులు విడుదల అయ్యాయని, దీని వలన విద్యార్థులు భవిషత్తులో ఉన్నత విద్యలో రిజర్వేషన్లు పొందుతారని ఇది విద్యార్థులకు ఒక గొప్ప అవకాశమని స్కౌట్స్ మాస్టర్ ఎల్లన్న తెలిపారు. విద్యార్థుల చేత వ్యాయమోపాధ్యాయులు స్వామిదాస్ రవికుమమార్ స్కౌట్ సేవా ప్రతిజ్ఞ చేయించారు. గైడ్ కెప్టన్ సెల్వియా రేచల్, ఉపాధ్యాయులు దేవప్రకాష్, ఆనందురావు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి కుక్కల దాడి.. రెండు దూడలు మృతి..!



**చాగలమర్రి, నవంబరు 17, ప్రభాతవార్తః** చాగలమర్రి పట్టణంలోని చింతలచెరువు రస్తాలో రామయ్య అనే పాడిరైతు పశువులకొట్టంపై వీధి కుక్కల గుంపు ఒక్కసారిగా దూడలపై అర్ధరాత్రి దాడిచేశాయి. ఈదాడిలో రెండు దూడలు అక్కడికక్కడే మృతి చెందగా మరోఐదు దూడలు తీవ్రంగా గాయ పడ్డాయి. విషయం తెలుసుకున్న పశువైద్యసిబ్బంది రాత్రి సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన దూడలకు చికిత్స అందించారు. ఈదాడిలో గాయపడిన దూడలను ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ పరిశీలించి చికిత్సలు అందించి మందులు అందజేశారు. వాటిలో రెండు దూడల పరిస్థితి విషయంగా ఉన్నట్లు తెలిపారు. పాడి ద్వారా తాను జీవనం సాగిస్తున్నానని కుక్కలదాడిలో నష్టపోయానని ప్రభుత్వం అదుకోవాలని కోరారు. పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

**- ఎం.పి. ఎమ్మెల్యేను అడ్డుకుంటాం**



**నందికొట్కూరు, నవంబరు 17, ప్రభాతవార్త :** రైతు సమస్యలను పరిష్కారించడంలో కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు ఎం.పి. ఎమ్మెల్యేలు పట్టించుకోవడడంలేదని వారిని అడ్డుకుంటామని సిపిఎం పార్టీ నాయకులు తెలిపారు. సోమవారం స్తానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.రాజశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతు రైతులు మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయాలని గత నెల రోజుల నుండి వివిధ రూపాల్లో ఆంధోళనలు చేస్తున్న రైతులు గురించి ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. రిలేనిరాహార దీక్షలో సిపిఎం నాయకులు పక్కీర్‌సాహెబ్,బెస్తరాజు,తారేష్‌రెడ్డి,ఎం.కరన,టి.ఓబులేష్,రమణ,త్యాగరాజు పాల్గొన్నారు.

# సర్వేలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



**చాగలమర్రి, నవంబరు 17, ప్రభాతవార్తః** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ రకాల సర్వేలను సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీడిఓ తాహేర్ ఉశేన్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నమస్తే సార్ మండల ఎంపీడివో అఫీసు నందు కలెక్టర్, హౌసింగ్ పీడీ, హౌసింగ డీఈ అదేశాల సారం అవాస్ 2024 పిఎంవై, 2.0సర్వేకు సంబంధించి హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయితీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణాల కోసం అన్‌లైన్ ధరకాస్తు చేసుకున్న 406 పేర్లను డిమాండ్ ఎంట్రి నందు నమోదుచేసి ఉన్నారని వాటిని వెంటనే గడువుఇచ్చిన సమయంలోపు పూర్తిచేయాలని అదేశించడం జరిగిందన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నవీన్, ఈవో తారకేశ్వరీ, పంచాయితీ కార్యదర్శులు సచివాలయ హెల్పర్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయి

**గడివేముల, నవంబరు17, ప్రభాతవార్త;**



క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని గ్రంథాలయాధికారి వి.వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గడివేములశాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయాధికారి వి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రవీంద్ర భారతి హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుబ్బరాయుడు, రాఘవేంద్ర, పాఠశాల హెచ్‌ఎం వంశీకృష్ణ, పిఈటీ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# అవాస్ ప్లస్ గ్రామిన్ యోజన-2024 సర్వే వేగవంతం చేయాలి

– స్వర్ణ పంచాయితీలకు సంబంధించి వందశాతం పన్నువసూలు చేయాలి – జిల్లా కలెక్టర్



**నంద్యాల, నవంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధిః** అవాస్ ప్లస్ గ్రామిన్ యోజన-2024 సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్‌రేట్‌లోని పిజిఆర్ఎస్ కార్యక్రమం సందర్భంగా వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర ్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ ప్రతిపేదవారికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ యొక్క ముఖ్యఉద్దేశమని హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరు సమన్వయంతో పనిచేసి అవాస్ ప్లస్ గ్రామిన్ యోజన-2024 సర్వే కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం నవంబరు 30లోపు పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మండలాలన్ని వెనకబడి ఉన్నాయని హౌసింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సర్వే పూర్తిచేయాలన్నారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు చేయాలంటే తప్పకుండా ఈసర్వే పూర్తిచేయాలన్నారు. ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, డిఎల్‌డివోలు పంచాయితీరాజ్ ఎస్ఈ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సర్వే పనులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో పంచాయితీలకు సంబంధించి 2025-26 సంవత ్సరానికి సంబంధించి వచ్చే మార్చి 31లోపు పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. నంద్యాల జిల్లాలో 3,14,652 ఇళ్ళకు సంబంధించి 10.51 కోట్ల పను ్న వసూలు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రూ.9,74,000 పన్ను వసూలు చేయడం జరిగిందని మిగతా మొత్తం పన్ను వసూలు చేసేందుకు పంచాయితీ కార్యదర్శిలు, బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్‌లు ప్రత్యే ్యక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## సర్వేయర్ల సంఘం డివిజన్ అధ్యక్షులుగా ఉరుకుంద ఆచారి



**మంత్రాలయం, నవంబరు17, ప్రభాతవార్త;** ఆదోని డివిజన్ గ్రామ సర్వేయర్‌ల అధ్యక్షులుగా మంత్రాలయం మండలం చెట్నహళ్లి గ్రామానికి చెందిన ఉరుకుంద ఆచారి ఎన్నికయ్యారు. ఆదోని రెవెన్యూ భవన్‌లో ఎన్నికల పద్ధతిలో వీరిని ఎన్నుకోవడం జరిగింది. ఇందులో అధ్యక్షులుగా ఉరుకుంద ఆచారి, ఉపాధ్యక్షులుగా రామ కృష్ణ, సెక్రటరీగా నాగార్జున, జాయింట్ సెక్రటరీగా సిందాల రాజు, ట్రెజరర్‌గా శివానంద కుమార్, మెంబర్లుగా సోనియా, సుల్తానా, శిరీష, చాకలి వెరకటరమణ, సుకన్య, సప్పోగు ఉదయ్‌కిరణ్, కురువ ఉరుకుందలను ఎన్నుకున్నారు.వీరిని శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## రాజ్యాంగ,చట్టవ్యతిరేక శక్తుల దాడులను ఎదుర్కొంటాం..

: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కర్నూలు దళిత న్యాయవాదుల ఆందోళన..



**కోసిగి, నవంబరు 17, ప్రభాతవార్త :**మనువాదుల ముసుగులో అధర్మవాదులు చేస్తున్న రాజ్యాంగం, చట్టం వ్యతిరేక శక్తుల దాడులను సమర్ధవంతంగా ఎదుర్కొంటామని మాదిగ లాయర్సు ఫెడరేషన్ అధ్యక్షులు ప్రభాకర్ అన్నారు. భారతదేశ సర్వోన్నత ముఖ్య న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై జరిగిన హేయమైన దాడికి వ్యతిరేకంగా సోమవారం డిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కర్నూలు జిల్లాకు చెందిన దళిత న్యాయవాదులు కలసి దళిత ఆత్మ గౌరవ ధర్మ నిరసన కార్యాక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దళిత న్యాయవాదుల అధ్యక్షులు ప్రభాకర్ మాట్లాడారు. ఎంఆర్‌పియస్ వ్యవస్థాపకులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాకు చెందిన పలువురు దళిత న్యాయ వాదులందరూ డిల్లీకు వెళ్లడం జరిగిందన్నారు. సుప్రీం కోర్టు జడ్జ్ గవాయి ఒంటరి వాడు కాదని పెద్ద ఎత్తున ఆయనకు మద్దతుగా ఉన్నారనా ్నరు. ఈలాంటి మద్దతు గవాయి గారికి ఉందన్న సంకేతాన్ని ఈ భారతానికి తెలియజేసేందుకు తాము ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నుండి డిల్లీకి వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా మనువాదుల ముసుగులో ఉన్న అధర్మవాదులు చేస్తున్న రాజ్యాంగ, చట్టవ్యతిరేక శక్తుల దాడులను తిప్పికొట్ట దానికి, దళిత ఆత్మ గౌరవం, అస్తికత్వానికి ఏ రూపంలోనైనా ప్రమాదం వచ్చినా దానిని ఎదుర్కొనే శక్తి ఉందనే విషయం రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు తెలియజేయడానికే ఛలో డిల్లీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. జస్టీస్ గవాయిపై జరిగిన దానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రదర్శలు చేపట్టారు. ఈరపోగు రాజేష్, మోజేస్ ప్రభాకర్, మనోజ్‌లు ప్రాదినిత్యం వహించారు..

## ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి..



**హొళగుంద, నవంబరు17, ప్రభాతవార్త;** హొళగుంద మండలంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయితీ కార్యదర్శులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదోని డీఎల్‌పీవో బాలకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం హొళగుంద మండలంలోని నాగరకన్వి గ్రామాన్ని ఆయన సందర్శించారు. నాగరకన్వి గ్రామంలో స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి గుత్తలను ఆన్‌లైన్‌లో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాల కొలతలపై ఏవైనా సందేహాలు ఉన్న పక్షంలో వారంలోపు తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు, డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. కార్యదర్శులు ఇంటి పన్నులు, మంచినీటి సరఫరా సమస్యలు, శానిటేషన్ కార్యక్రమాలు, డోర్ టూ డోర్ చెత్త సేకరణ పర్యవేక్షణ, షెడ్ల నిర్వహణ, ట్యాంకులను శుభ్రం చేయడం, డ్రైనేజీ శుభ్రం చేయడం వంటి వాటిపై చర్చించారు. అన్ని రకాల పన్నులు స్వర్ణ గ్రామ పంచాయతీ పోర్టల్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో వసూలు చేయాలన్నారు. ఎవరూ ఆఫ్‌లైన్‌లో నమోదు చేయకూడదన్నారు. ఎంపీడీఓ విజయలలిత, డిప్యూటీ ఎంపీడీఓ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలకు కృషి చేయండి



**ఆదోని, నవంబర్ 17, ప్రభాతవార్త :** అకడమిక్ ఇన్స్పక్టర్లు మంజూరు కు కృషి చేయండి.ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథ్ రెడ్డికు ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ ,ఎస్టీయూ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి మున్సిపల్ ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలపై ఆదివారం విజయవాడలో ప్రాతినిధ్యం చేయడం జరిగింది. మున్సిపల్ ,కార్పొరేషన్ పరిధిలో పెండింగ్ లో ఉన్న అర్బన్ ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులు మంజూరుకు చేయాలని,మునిసిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఎక్కవ ఉందని,అకడమిక్ ఇన్స్పెక్టర్లు నియామకం కృషి చేయాలని, పెండింగ్లో ఉన్నటువంటి పండితులు ఉన్నతీకరణ పూర్తి చేయాలని, మిగిలిన పోస్టులకు ఎస్జీటీలకు అవకాశం కల్పించేలా సవరణలకు కృషిచేయాలని, మునిసిపల్ ఉపాధ్యాయుల జి పి ఎఫ్ కు కృషి చేయాలని,కొత్తగా ఏర్పడిన మునిసిపల్ ప్రాంతాల్లో కొత్త పాఠశాలలు ఏర్పాటుకు ఒత్తిడి చేయాలని, మున్సిపల్ టీచర్ల అంతర యాజమాన్య బదిలీలు షెడ్యూల్ విడుదలకు కృషి చేయాలని ప్రాతినిధ్యం చేశారు.

## ప్రజాస్వామ్యమా? లేక రౌడీల రాజ్యమా?



**కర్నూలు అర్బన్, నవంబర్ 17,ప్రభాతవార్త:** హిందూపురంలో వైయస్ఆర్ సీపీ పార్టీ కార్యాలయంపై టీడీపీ గూండాలు చేసిన దాడిని ఖండిస్తూ కర్నూలు లో వైయస్సార్ విగ్రహం వద్ద, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్.వి. మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలో ఈ దౌర్జన్యం జరగడం చాలా బాధాకరమని తెలిపారు, వైసిపి కార్యాలయ అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం చేస్తున్న అడ్డుకున్న వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలపై కూడా దాడి చేయడం విలువలతో కూడుకున్న రాజకీయం కాదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న హేయమైన తప్పులు సిఎం నారా చంద్రబాబు నాయుడు కు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఇలాంటి వాటికి వైసిపి పార్టీ భయపడేది లేదని మీరు చేస్తున్న దాడులను రాష్ట్రం ప్రజలు గమనిస్తున్నారని ఇలాంటి దాడులను ఆపకపోతే త్వరలోనే ప్రజలే మీకు బుద్ధి చెప్తారని తెలిపారు.

## భారీ పరిశ్రమలతో యువతకు ఉపాధి..



**గడివేముల, నవంబరు 17, ప్రభాతవార్త;** భారీ పరిశ్రమలతో యువతకు సీఐఐ సమ్మిట్ 2025లో కూటమి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు స్వీకరించి పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేలా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైజాగ్‌లో రెండు రోజులపాటు సీఐఐ సమిట్ 2025 ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. 16 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ముందుచూపుతో రాష్ట్రం అభివృద్ధివైపు అడుగులు వేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించి ఆంధ్రప్రదేశ్‌ను వ్యాపారకేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కృషి అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు



**దేవనకొండ, నవంబరు17, ప్రభాతవార్త;** గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని దేవనకొండ గ్రంథాలయ సహాయకులు శ్రీనివాసులు పేర్కొన్నారు. దేవనకొండ గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆంధ్ర రాష్ట్ర స్వాతంత్ర్య ఉద్యమ పోరాట నాయకులైన అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి గ్రంథాలయ సిబ్బంది పూలమాలలు వేసి స్మరించుకున్నారు. జ్ఞాన సుధ పాఠశాల విద్యార్థులకు ఝాన్సీ లక్ష్మీబాయి గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల పరిషత్ పాఠశాలలో డ్రాయింగ్ కాంపిటీషన్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సహాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన వారి సేవలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

## వైకుంఠం పర్యటనను జయప్రదం చేయండి



**చిప్పగిరి, నవంబర్ 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చిప్పగిరిలో నేడు జరిగే ఆలూరు టిడిపి ఇన్చార్జ్ దంపతులు వైకుంఠం జ్యోతి ప్రసాదుల పర్యటనను జయప్రదం చేయాలని చిప్పగిరి మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ యువ నాయకులు కొండ రామాంజనేయులు, కుందన గుర్తి గ్రామ సర్పంచ్ కొండా పురుషోత్తం పిలుపునిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు దివంగత మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ వైకుంఠం శ్రీరాములు దంపతులు 19వ వర్ధంతి సందర్భంగా ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి నాయకులూ కార్యకర్తలు పెద్ద ఎత్తున చిప్పగిరికి తరలిస్తున్నట్లు తెలిపారు. చిప్పగిరి మండలం నాయకులు కూడా పాల్గొని దివంగత వైకుంఠం శ్రీరాములు దంపతులు వర్ధంతి కార్యక్రమం మూడు గంటలకు ప్రారంభమై పూజ నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ నుండి ర్యాలీగా చిప్పగిరిలో రాయలనాటి కాలంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శ్రీ భోగ లింగేశ్వర స్వామి దేవాలయం ముందు వైకుంఠం జ్యోతి ఇన్చార్జి చేపట్టిన మొట్టమొదటి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి చిప్పగిరి మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు వైకుంఠం అభిమానులు గ్రామ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## భక్తులతో పులకించిన పాతబుగ్గ



**డోన్, నవంబర్ 17: ప్రభాతవార్త :** కార్తీక మాసపు చివరి సోమవారం కావడంతో సోమవారం డోన్ పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త బైసాని రాజు వారి ధర్మపత్ని కవిత ఆధ్వర్యంలో స్వామివారికి సహస్ర రుద్రాక్షలతో రుద్రాక్ష అభిషేకం ఘనంగా నిర్వహించారు. అభిషేకం అనంతరం భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారికి అభిషేకించిన ఒక్కొక్క రుద్రాక్షను ప్రతి భక్తుడికి ప్రసాదంగా అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కర్తీక మాసపు చివరి సోమవారం కావడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగి భక్తి వాతావరణం నెలకొంది.

## కిక్కిరిసిన శైవ క్షేత్రాలు



**చాగలమర్రి, నవంబరు 17, ప్రభాతవార్తః** కార్తీకమాస కడసోమవారం సందర ్భంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. చాగలమర్రి పట్టణంలోని భీమ లింగేశ్వర, రామలింగేశ్వరస్వామి ఆలయాలతోపాటు మండలంలోని చింతలచెరువు గ్రామసమీపంలో ఉన్న బైరవగుండాల ఆలయం తదితర శైవ క్షేత్రాలు శివనామస్మరణలతో మారుమోగాయి. పలుచోట్ల ప్రతే ్యక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్థానిక గ్రామదేవత చాగలమ్మ ఆలయంలో భక్తులకు వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాష, జట్టి నాగరాజు, గుత్తి నరసింహులు, సురేష్, రాజేంద్ర, ఇంతియాజ్ పాల్గొన్నారు.

## కమ్మకులస్థుల ఆధ్వర్యంలో అన్నవితరణ



**మహానంది, నవంబరు 17, ప్రభాతవార్తః** కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా కమ్మకుస్థులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహానంది మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన మహానంది మండల టీడీపీ అధ్యక్షుడు కంచర్ల శివశంకర్ చౌదరి, గడ్డం నాగపుల్లయ్య, వేమూరి కేశాలు ఆధ్వర్యంలో సదానంద ఆశ్రమం వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ముందుగా సదానంద ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక చివరిమాసం కావడంతో నంద్యాల నుండి మహానంది పుణ్యక్షేత్రానికి వెళ్లె భక్తులు కాలినడకన వెళ్లె వందలాది మంది భక్తులు అక్కడ అన్నవితరణ చేసి తమ ఆకలి తీర్చుకున్నారు.కమ్మసంఘం నాయకులు అడ్వకేట్ కంచర్ల సత్యనారాయణ, ఉప సర్పంచ్ పోక ఉశేని, మాజీ సర్పంచ్ గడ్డం హరిప్రసాద్, నరసయ్య, నల్లపాటి శంకర్, ఆదినారాయణ, పోక కిట్టు, సాంబమూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటలో మెలుకువలు పాటిస్తే..అధిక దిగుబడులు..!



**క్రిష్ణగిరి, నవంబర్ 17, ప్రభాతవార్త :** వరి పంటలో మెలుకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మహేంద్ర అన్నారు. ప్రస్తుతం వరి పంట కంకి దశలో ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సేంద్రియ పద్ధతులు ఉపయోగించి చీడపీడలను నివారించుకోవాలన్నారు. రసాయనికి ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. వేప కషాయం పిచికారి చేయాలన్నారు. మంచి నాణ్యత కలిగిన దాన్యంను పంట పండిస్తే మీకు డబ్బు ఆదా కావడంతో పాటు ప్రజల ఆరోగ్యం ను కాపాడిన వారు అవుతారన్నారు. ఈ గ్రామంలో వరి పంట వేసిన రైతులు పాల్గొన్నారు.

## ముక్కెళ్ళ గ్రామానికి నేడు మాజీ ఎమ్మెల్యే రాక



**తుగ్గలి, నవంబరు 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ముక్కెళ్ళ గ్రామానికి మంగళవారం సాయంత్రం పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నారని వైయస్సార్సిపి సోషల్ మీడియా విభాగపు జిల్లా కార్యదర్శి ముడియాల ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ముక్కెళ్ళ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున వైసిపి నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## జోహరాపురంలో పంట కోత కార్యక్రమం



**నందవరం, నవంబరు 17, ప్రభాతవార్తః** మండలంలోని పెద్దకొత్తిలి పంచాయితీ పరిధిలోని జోహరాపురం వ్యవసాయ అధికారి సరిత వరి పంట కోత కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతు కురువ భీమన్న పొలంలో 5ఇన్‌టు5 విస్తీర్ణలంలో పంట కోత ప్రయోగం నందు 15.84 కేజీల దిగుబడి రావడం జరిగిందన్నారు. రైతు పంట ఎకరాకు సుమారుగా 35-40 బస్తాల వరకు దిగుబడి రావడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో విఏఏ రాఘవేంద్ర, ఎంపీఈఓ శ్రీనివాసులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## చదువుతోనే సాధ్యం..



**గోనెగండ్ల, నవంబరు 17, ప్రభాతవార్త :** చదువుకుంటేనే మనం ఏదైనా సాధించగలమని, అలాగే ఇంకొకరికి సహాయం చేయగలమని ఎంఈఓ రామాంజినేయులు తెలిపారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్ స్కూల్)కు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి పి.ఫారుక్ భోజనం ప్లేట్లను బహుక ◌ూరించారు. ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ, నాటి వలంటీర్ ఉపాధ్యాయుడు ఊట్ల రంగన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి చదువుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని తెలిపారు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యన్ని సాధించాలంటే బాగా చదువు కోవాలన్నారు. గోనెగండ్ల మెయిన్ స్కూల్ లో 1995-99లో (1నుంచి 5వరకు) చదివిన పి.ఫారుక్ బాగా చదువుకొని నేడు విదేశాల్లో స్థిర పడి తాను చదువుకున్న పాఠశాలకు దాదాపు రూ.10వేలు మరియు 140 భోజనం ప్లేట్లు బహుకరించడం చాల సంతోషమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థి తన తండ్రి నూరఅహ్మద్, ఎంఈవోల చేతుల మీదుగా ప్లేట్లను విద్యార్థులకు అందజేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం బతకన్న ఆధ్వర్యంలో ఎంఈవోలకు,నూరఅహ్మద్‌కు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు,నాటి గురువులు ఊట్ల రంగన్న, అనిఫ్, పూర్వ విద్యార్థులు కిరణ్‌కుమార్, మునిస్వామి, కౌలుట్లయ్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## క్రీడాకారులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



**ఆత్మకూరు, నవంబర్ 17, ప్రభాతవార్త:** పతి ఒక్కరు చదువుతో పాటు క్రీడలను తప్పకుండా ఆస్వాదించాలని ఒంగోలు గౌతమి ఫౌండేషన్ చైర్మన్ అంకయ్య చౌదరీ తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ కెవికె స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 14 17 బాలబాలికల ఖోఖో క్యాంప్ ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నా గౌరవంగా ఆహ్వానం పలికారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో గౌతమి ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. రాష్ట్రస్థాయి లో నిర్వహించే ఉద్యోగ నియామకాల్లో 3 శాతం రిజర్వేషన్ కలదని ప్రతిఒక్కరూ జాతీయ అంతర్జాతీయ స్థాయి లో రాణించాలని తెలియజేశారు క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైల్వే వాలీబాల్ కోచ్ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ శిక్షణ తీసుకొనే క్రీడాకారులకు బోజన వసతి కల్పించిన ఒంగోలు గౌతమి ఫౌండేషన్ సెక్రటరీ అంకయ్య చౌదరి కి కృతజ్ఞతలు తెలియజేశారు . ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ షాహబుద్దీన్ ఆసర్.నూర్ బేగ్ మాట్లాడుతూ క్రీడాకారులకు స్టేడియం లో అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నారని క్రీడాకారులు ఆత్మకూర్ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మకూర్ వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ కృష్ణ యాదవ్, ఖోఖో శిక్షకులు మహేబూబ్,కబడ్డీ శిక్షకులు వెంకటేశ్వర గౌడ్, బాక్సింగ్ శిక్షకులు ఉపేంద్ర, జబ్బర్, పాన్ మహమ్మద్ పాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితుడు అరెస్టు



**బేతంచెర్ల, నవంబరు 17, ప్రభాతవార్తః** మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో సయ్యద్ మహబూబ్ బాషను హత్యచేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్‌రావు సోమారం తెలాపారు. వివరాల మేరకు మహబూబ్ బాషను హత్యచేసిన ఎం మధుభూపాల్ 16న మద్దిలేటి స్వామి వెళ్లెదారిలో కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద వెళ్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి హత్యకు ఉపయోగించిన బళ్లెం స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. 17న డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు సిఐ తెలిపారు.

## పాల ఉత్పాదకదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఎన్నిక వాయిదా

**రుద్రవరం, నవంబరు 17, ప్రభాతవార్తః**

రుద్రవరం గ్రామ పంచాయితీ పరిధిలో జరగాల్సిన పాల ఉత్పాదకదారుల పరస్పర సహాయ సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నిక వాయిదా పడినట్లు ఎంపీడిఓ భాగ్యలక్ష్మీ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ కోసం ఎన్నికల అధికారి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది అయితే ఈసమయం వరకు ఎన్నిక జరగలేదని ఎంపీడివో తెలిపారు. తదుపరి ఎన్నికల తేది అధికారులు త్వరలో వెల్లడిస్తారన్నారు.

## వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం



**పత్తికొండ, నవంబరు 17, ప్రభాతవార్త :** పట్టణంలోని వృద్ధాశ్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సాయిబాబ ఆధ్వర్యంలో ఆశ్రమంలోని ఉచితంగా వృద్ధులకు బిపి, షుగర్, మరియు ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ మౌనిక, ఏఎన్ఎం పుష్పలత మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ప్రతి నెల ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వైసిపి దీక్ష



**నందికొట్కూరు, నవంబరు 17, ప్రభాతవార్త:** రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వెంటనే మొక్కజొన్న పంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పటు చేసి రూ.2400లతో కొనుగోలు చేయాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలోని పటేల్ సెంటర్‌లో నందికొట్కూరు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త డా.దారా సుధీర్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతు అధిక వర్షాల వల్ల రైతులు పండించిన పంటలు పూర్తిగా దెబ్బతిని పెట్టిన పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం ఇప్పటికైన స్పంధించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో మొక్కజొన్న కొనాలని ఆయన డిమాండ్ చేశారు. జడ్పీటిసిలు జగదీశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాధూరిగౌడ్, వైసిపి నాయకులు పుల్యాల నాగిరెడ్డి, తులసిరెడ్డి, జబ్బార్‌మియ్య, గోవిందురెడ్డి, మండ్లెం రమణ, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వైసిపి రిలే దీక్షకు సిపిఐ మద్దతు:** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైయస్సార్సిపి చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సిపిఐ నాయకులు వి.రఘురాంమూర్తి, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనువాసులు పాల్గొని మద్దతు తెలిపారు.

## ప్రథమ నంది ఆలయంలో అన్నదానం



**నంద్యాల హాస్పటల్, నవంబరు 17, ప్రభాతవార్త :** ఎంతో పవిత్ర పుణ్యక్షేత్రమైన ప్రథమ నంది ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో వైయస్సార్సిపి నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, క్రాంతినగర్ మల్లికార్జునరెడ్డి, చాపిరేవుల గోవిందురెడ్డి

## రూ.35 కోట్ల భారీ మోసం..నలుగురు అరెస్టు..!

– ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్

**ఆళ్లగడ్డ, నవంబరు 17, ప్రభాతవార్తః**



దొర్నిపాడు పోలీస్‌స్టేషన్‌లో నమోదు అయిన క్రైం నం.95/2025 కేసులో నిందితులైన నలుగురిని ఈనెల 16న దొర్నిపాడు కొండాపురం ప్రాంతాల మధ్యలో పోలీసులు అరెస్టుచేసినట్లు ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ తెలిపారు. సోమవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో అరెస్టుచేసిన ముద్దాయిలను ఆయన చూపించారు. అనంతరం ఆయన మాటా ్లడుతూ ముద్దాయిలు అంతపు రాజారెడ్డి అనంతపురం జిల్లా, సింగతల ఉమామహేశ్వర్‌రెడ్డి నందా ్యల జిల్లా, బాచిరెడ్డి వీరారెడ్డి దొర్నిపాడు, బాచిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి దొర్నిపాడు ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రజలను నమ్మబలికి గ్రామాల వారిగా బారీ డిపాజిట్‌లు వసూలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. మొదట కుటుంబ సభ్యులకు డబ్బులుచెల్లించి నమ్మకం కల్పించి తరువాత మరింత మందిని చేర ్చుకున్నారన్నారు. అనంతపురం జిల్లా గొద్దుమర్రి గ్రామంలో 250మంది దొర్నిపాడు గ్రామంలో 950 మంది సహా మొత్తం 1200 మంది నుండి రూ.35 కోట్లకు పైగా వసూలు చేసినట్లు తెలిపారు. బాధితులకు చెల్లింపు నిలిపివేయడంతో కేసులు నమోదు అవుతాయనే భయంతో నిందితులు పరార్‌లో ఉన్నారని వారిని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ అదేశాల మేరకు మా పోలీసులు ముద్దాయిలను పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితుల వద్ద నుండి ల్యాబ్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ప్రామిసరినోటు కాపీలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా డబ్బు వస్తుందని చెప్పె వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోసపూరిత పథకాలపై నమ్మకం పెట్టవద్దన్నారు. మోసగాలైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో రూరల్ సిఐ మురళీధర్‌రెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుంది

– సొసైటీ మాజీ అధ్యక్షులు నర్సింగ్‌కాంతారెడ్డి



**వెల్దుర్తి, నవంబర్ 17, ప్రభాతవార్త :** ఈ ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని గ్రామపెద్దలు,మాజీ సొసైటీ అధ్యక్షులు నర్సింగ్ కాంతారెడ్డి అన్నారు. మండలంలోని ఎస్.బోయినపల్లి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2.30లక్షలతో నిర్మించిన పశువుల షెడ్డును సోమవారం కాంతారెడ్డి చేతుల మీదుగా ఉపాధిహామీ అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఆయన తన స్వగృహం నుంచి షెడ్డు నిర్మాణం ప్రారంభానికి బయలుదేరగానే గ్రామస్తులు,కాలనీవాసులు అడుగడుగున ఆయనను పూలు,మేళతాళాలు,బాణసంచాతో సాదరంగా ఆహ్వానించారు.ముందుగా కాంతారెడ్డిని లబ్దిదారుడు రైతు బోయదుబ్బకాళ్లరవి కుటుంబ సమేతంగా పూలమాల వేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ అధికారులు ఇసి ఫృద్వీరాజ్,టిఏ శాంతి, రాజు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# లక్షదీపోత్సవంతో.. శ్రీశైలగిరులు..!





: దీపాకాంతులతో – పుష్కరిణిహారతి

**శ్రీశైలంప్రాజెక్టు,నవంబరు17,ప్రభాతవార్త**

శ్రీగిరిక్షేత్రంలో లక్షదీపోత్సవ వెలుగులతో మిరుమిట్లుగొలిపింది.దీపాకాంతులతో – పుష్కరిణి హారతితో పులకించింది.కార్తిక నాల్గవ సోమవారం సందర్భంగా పుష్కరిణి వద్ద దేవస్థానం లక్ష దీపోత్సవం మరియు పుష్కరిణిహారతి నిర్వహించింది. లోక కల్యాణం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

**లక్షదీపోత్సవ:** ఈ దీపోత్సవ కార్యక్రమంలో పుష్కరిణీ ప్రాంగణమంతా కూడా దీపాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది.

**పుష్కరిణి హారతి (దశవిధ–హరతులు):**

సోమవారంనాడు సాయంత్రం గం.6.30ల నుండి ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లకు మరియు పుష్కరిణీకి దశవిధ హారతులు శాస్త్రోక్తంగా ఇవ్వబడ్డాయి.కాగా ఈ కార్యక్రమానికి ముందుగా శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు వేంచేబు చేయించి విశేషంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఆధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, శ్రీశైలదేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను ఇవ్వడం జరిగింది.అనంతరం ఓంకారహారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి,సూర్యహరతి,చంద్రహారతి,కుంభహారతి,నక్షత్రహారతి,కర్పూరహారతులు సమర్పించబడ్డాయి.

**దశహారతులు – దర్శనఫలం:**

1)–ఓంకారహారతి: పరబ్రహ్మ స్వరూపమైన బీజాక్షరమే ఓంకారం.ఈ ఓంకారహారతిని దర్శించడం వలన కష్టాలన్నీ నివారించబడుతాయి.సకల శుభాలు కలుగుతాయి.

2)–నాగహారతి: ఈ నాగహారతిని దర్శించడం వలన సర్పదోషాలు తొలగిపోతాయి.

3)–త్రిశూలహారతి: ఈ త్రిశూలహారతిని దర్శించడం వలన అపమృత్యువు అంటే అకాలమరణం తొలగిపోతుంది.గ్రహదోషాలు నివారించబడుతాయి.

4)–నందిహారతి: ఈ నందిహారతిని దర్శించడం వలన భయం, దు:ఖము ఉండవు. అనందం, ఉత్సాహం, లబిస్తాయి.

5)–సింహహారతి: ఈ సింహహారతిని దర్శించడం వలన శత్రుబాధలు తొలగుతాయి.మనో ధైర్యం కలుగుతుంది.

6)–సూర్యహారతి: ఈ సూర్యహారతిని దర్శించడం వలన ఆరోగ్యం చేకూరుతుంది.దీర్ఘాయుష్షు లబిస్తుంది.

7)–చంద్రహారతి: ఈ చంద్రహారతి దర్శించడం వలన మనశుద్ధి కలిగి,ఈర్ష్య,అసూయ ద్వేషాలు తొలగి పోతాయి. మానసిక ప్రశాంతత లబిస్తుంది.

8)–కుంభహారతి: ఈ కుంభహారతిని దర్శించడం వలన కోరుకున్న కోరికలు నెరవేరుతాయి.సంపదల కలుగుతాయి.

9)–నక్షత్రహారతి: ఈ నక్షత్రహారతిని దర్శించడం వలన జాతక దోషాలు తొలగిపోతాయి,చేపట్టిన పనులలో విజయం లబిస్తుంది.

10)–కర్పూరహారతి: ఈ కర్పూరహారతిని దర్శించడం వలన పాపాలన్నీ తొలగిపోతాయి.యజ్ఞఫలంతో పాటు అష్ట ఐశ్వర్యాలు సిద్దిస్తాయి.

# నంద్యాల జిల్లాను కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నందా ్యల, నవంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధిః**

నంద్యాల జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్ నందు జిల్లా కలెక ్టర్ రాజకుమారి గణియా తదితర అధికారులతో కలిసి జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం పోస్టర్‌ను అవిస్కరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 30వ తేది వరకు కుష్టువ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రే అను బ్యాక్టీరియా వలన వస్తుందన్నారు. ఈక్రిములు తుమ్మడం, దగ్గడం వలన వ్యాప్తి చెందుతాయన్నారు. ఈవ్యాధి లక్షణాలు కనిపించడానికి ఐదు నుంచి ఏడు సంవత ్సరాలు పడుతుందన్నారు. చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు, పొడలు, నొప్పికూడిన నరములు, కాళ్లు, లేదా చేతుల కండరాల్లో బలహీనత చేతుల పాదాలు, నరములలో తిమ్మిర్లుగా అనిపించడం, నొప్పిగా అనిపించని పుండ్లు, చేతులలో పాదాలలో ఉండడం వంటి లక్షణాలుంటాయని ఈవ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు.



# ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి.

**: పి.జి.ఆర్.ఎస్ వచ్చిన అర్జీలను గడవు లోపు పరిష్కారం**

**: ఆదోని ఇంచార్జ్ సబ్ కలెక్టర్ టి . అజయ్ కుమార్**



**ఆదోని నవంబర్ 17 ప్రభాతవార్త :**

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జిదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని ఇంచార్జ సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం పిజిఆర్ఎస్ లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. .మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ ఎల్ ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజా, ఆర్టీసీ డిపో రఫీ తదితరులు పాల్గొన్నారు.

# రహదారులతో గ్రామాలకు మహర్ధశ

**: ఎమ్మెల్యే కె.యి శ్యాంకుమార్**



**క్రిష్ణగిరి,నవంబర్17,ప్రభాతవార్త :**

రహదారులతో గ్రామాలకు మహర్ధశ పట్టినదని పత్తికొండ ఎమ్మెల్యే కె.యి శ్యాంకుమార్ అన్నారు.సోమవారం రోజు మండల పరిదిలోని తొగర్చెడు,టి.గోకులపాడు గ్రామాలకు బి.టి రోడ్డు నిర్మాణాలను ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సభ లో ఆయన మాట్లాడుతూ టి.డి.పి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాలకు సి.సి రోడ్లు,రహదారుల నిర్మానాలను చేపట్టామన్నారు. రహదారుల నిర్మాణం వలన పల్లెలకు పట్టనాలకు కనెక్టివిటి పెరుగుతుందన్నారు.వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడా నికి సులభతరం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలకు అభివృద్ధికి ప్రణాళికలు కృషిచేస్తున్నాడన్నారు.నాబార్డు నిధుల క్రింద వెల్దుర్తి,పి.కోటకొండ ఆర్ అండ్ బి రోడ్డు నుండి తొగర్చెడు వరకు 120లక్షల రూపాయలతో బి.టి రోడ్డు వేశామన్నారు. అలాగే వెల్దుర్తి,కోడుమూరు రోడ్డు నుండి టి.గోకులపాడు వరకు 150లక్షల రూపాయలతో బి.టి రోడ్డును చేపట్టారు.దీని వలన గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పంచాయితిరాజ్ అధికారులు ఇ.ఇ శేషయ్య,పి.ఆ ర్ ఏ.ఇ జాకీర్‌హుస్సేన్ టి.డి.పి నాయకులు పత్తికొండ మార్కెట్‌యార్డు ఛైర్మన్ యస్.కె నబిసాహెబ్,మండల టి.డి.పి అధ్యక్షులు దామోదర్‌నాయుడు,సగర సంఘం రాష్ట్ర డైరక్టర్ టి.డి.పి లీగల్‌సెల్ జనరల్ సెక్రటరి యల్.వి ప్రసాదు,తొగర్చెడు శివరాముడు,టి.గోకుల పాడు రామాంజినేయులు కంభాలపాడు సద్దల రమేశు,పోతుగల్లు సోమలింగడు, క్రిష్ణగిరి జ్యోతిగౌడు,రామానాయుడు,కోయిలకొండ చంద్రశేఖర్‌గౌడు, యస్.ఎర్రగుడి సజ్జద్,తదితరులు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

**: ఎమ్మెల్యేకు వినతి పత్రం**

**ఆలూరు,నవంబరు 17,ప్రభాతవార్త:**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అయిన రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేదని మీరు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ బోయ మునిస్వామి ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బూషినే విరుపాక్షి కి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మునిస్వామి మాట్లాడుతు రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర లేకపోవడం రైతు అప్పుల్లో కూరుకుపోతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కార్పొరేట్ల శక్తులపై ప్రేమ చూపుతున్న వారికి రైతులపై ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. కావున మీరు రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యేకు వివరించారు.

# రచ్చకెక్కిన అన్నదమ్ముల భూ.. వివాదం..!

**: ఒకరి పంట మరొకరు నాశనం చేసుకుంటున్న వైనం**

**: ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు !**





**పెద్దకడబూరు నవంబర్ 17 ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామానికి చెందిన ఉప్పర శివన్న, ఉప్పర చిన్న ఈరన్న కుటుంబాల మధ్య భూ వివాదం కొన్ని సంవత్సరాలు నుంచి నడుస్తుంది ఇరు కుటుంబాలు కోర్టులను ఆశ్రయించడంతో వాదం కోర్టు పరిధిలోకి వెళ్ళింది కోర్టులో కేసు నడుస్తుండగానే గ్రామంలో మాత్రము ఒకరిపై ఒకరు కక్ష పెంచుకుంటూ తము పండించుకునే పంటలపై ప్రతాపం చూపిస్తూ నాశనం చేసుకుంటు న్నారు ఇటీవల మొన్న ఉప్పర చిన్న ఈరన్న పొలంలో వేసిన శనగ పంటను ఉప్పర శివన్న కొడుకు ఉప్పర ఈరన్న ట్రాక్టర్ తో రాత్రికి రాత్రి దున్నేశాడని చిన్న ఈరన్న కొడుకులు పూర్ణచంద్ర శివ కుమారులు విలేకరుల ముందు వాపోయారు నిన్న ఉప్పర శివన్న మిరప పంటకు చిన్న ఈరన్న కొడుకు పూర్ణ చంద్ర గడ్డి మందు కొట్టడంతో తమ పంట అంతా నాశనం అయిందని దాదాపు 5 లక్షల వరకు నష్టం జరిగిందని పంట నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉప్పర ఈరన్న సోమవారం విలేకరులకు తెలిపారు తమకు జరిగిన నష్టం పై ఇరు కుటుంబాలు ఒకరిపై మరొకరు ఎస్సై నిరంజన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు చేతికొచ్చిన మిరప పంటను గడ్డి మందు వేసి నాశనం చేశారని తమకు 5 లక్షల పరిహారం ఇప్పించాలని లేకపోతే ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆత్మహత్య చేసుకుంటామని ఉప్పర ఈరన్న అధికారులను కోరారు ముందు మా శనగ పంటను ట్రాక్టర్ తో దున్నేసి నష్టం చేసినందుకే ఉప్పర ఈరన్న మిరప పంటకు గడ్డి మందు వేయడం జరిగిందని తాము ఉద్దేశపూర్వకంగా చేయలేదని ముందు ఉప్పర ఈరన్న పైనే చర్యలు తీసుకోవాలని ఉప్పర పూర్ణచంద్ర ఉప్పర శివకుమార్ లు డిమాండ్ చేశారు ఇలా సొంత అన్నదమ్ములు భూ వివాదంలో పట్టింపులకు పోవడం ఎవరికి చెప్పినా వినకపోవడంతో మేము చేసేది ఏమి లేదని ఆయా రాజకీయ పార్టీ ముఖ్య నాయకులు, అధికారులు చేతులెత్తేసినట్లు సమాచారం కోర్టులో తీర్పు వచ్చేంత వరకైనా ఎవరి పని వారు చేసుకుంటే బాగుంటుందని ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకొని పంటలు నాశనం చేసుకోవడం సరికాదని గ్రామస్తులు చర్చించుకుంటు న్నారు ఏది ఏమైనా అన్నదమ్ముల భూ వివాదం ఎక్కడ దాకా వెళుతుందో వేచి చూడాల్సిందే !

# ఘనంగా దామోదర-కార్తీక లక్షదీపోత్సవం

**- మాజీ మంత్రి కెఇ ప్రభాకర్, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు, కాల్వబుగ్గ శివసాయిబాబ, ప్రముఖులు, అధికారులు హాజరు..**




**వెల్దుర్తి,నవంబర్17,ప్రభాతవార్త**

మండల కేంద్రమైన వెల్దుర్తి జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో కార్తీక దామోదర మాసాన్ని పురస్కరించుకొని ఇస్కాన్–అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘం,కర్నూలు పూజ్యశ్రీ రూపేశ్వర చైతన్యదాస్ ఆధ్వర్యంలో కార్తీకమాస చివరి సోమవారం లక్షదీపోత్సవ కార్యక్రమం తెదేపా సీనియర్ నాయకులు మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కెఇ ప్రభాకర్, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు,కాల్వబుగ్గ శివసాయిబాబతో పాటు ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.వారిని మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్,మాజీ జడ్పీటిసి యల్.ఇ.పుష్పావతి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. పూజ్యశ్రీ రూపేశ్వర చైతన్యదాస్,మందిర ఉపాధ్యక్షులు,ఇస్కాన్ తిరుపతి వారిచే దామోదర లీల ప్రవచనము,దామోదర హరతి,కార్తీక దామోదర లక్షదీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర ్భంగా మాజీ మంత్రి కెఇ ప్రభాకర్,పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు.ఇటువంటి దైవచింతన కార్యక్రమాలకు హాజరై ఆ భగవంతుని ఆశీస్సులు పొందాలన్నారు.సభాస్థలిపై హరే రామ హరే క్రిష్ణ అనే కీర్తనలతో ఇస్కాన్ బృందం సభ్యులతో కలిసి నృత్యం చేశారు.ఈ లక్షదీపోత్సవానికి భక్తులు కుటుంబసమేతంగా ఎక్కువ సంఖ్యలో హాజరై కార్తీకదీపాలు వెలిగించారు.భక్తులందరికి ప్రసాదం, అన్నదానం ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్,మాజీ జడ్పీటిసి యల్.ఇ.పుష్పావతి, మండల తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మ,ఎంపిడిఓ సుహాసినమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ రవికిశోర్,ఇఓ లక్ష్మీనాథ్,పారిశ్రామికవేత్త తిరివీధిసాయి ప్రసాద్, విదా ్యనికేతన విద్యాసంస్థల నిర్వాహకులు రమణాచలం, పుల్లగుమ్మి మురసాని వెంకటేశ్వరరెడ్డి,తెదేపా నాయకులు వీరభద్రుడు,పూలరాముడు,మాజీ జడ్పీటిసి ఐజయ్య,కిట్టు, మల్లికార్జున, పరమేష్, హరి, వడ్డెరసంఘం మండల అధ్యక్షులు మహేష్, విద్యాకమిటీ ఛైర్మెన్ రాజేష్ పాల్గొన్నారు.

# కడపడి సోమవారం భక్తులతో.. పోటెత్తిన యాగంటి క్షేత్రం

**– మారుమోగిన శివనామస్మరణ**



బనగానపల్లె, నవంబరు 17, ప్రభాతవార్తః కార్తీక కడపటి సోమవారం సందర ్భంగా మండలంలో పలుశైవ క్షేత్రాలు పెద్ద ఎత్తున భక్తుల శివనామస్మరణలతో మారుమోగాయి.తెల్లవారుజామున పుణ్యస్నానాలు అచరించి భక్తిశ్రద్దలతో శివాలయాలను క్షేత్రాలను సందర్శించి శివయ్యకు ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. ప్రధానంగా ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి క్షే త్రానికి ఉదయం నుండి భక్తులు పోటెత్తారు పెద్ద పుష్కరణిలో పుణ్యస్నానాలు అచరించిన భక్తజనం క్యూలైన్‌లో వెళ్లి ఉమామహేశ్వరస్వాములను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం గాలిగోపురం ఎదురుగా ఉన్న ధ్వజస్థంబం వద్ద కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రద్ది ఎక్కువగా ఉండడంతో ఆలయ కార్యనిర్వాహణ అధికారి పాండు రంగారెడ్డి, ఉప సర్పంచ్ బండి మౌలిశ్వర్‌రెడ్డి ఆలయ సిబ ్బంది భక్తుల రద్దీని అంచన వేస్తు క్యూలైన్ పర్యవేక్షణ చేసి భక్తులకు గర్భాలయంలో స్వామివారి అభిషేకాలకు, స్పర్శ దర్శనానికి అవకాశం కల్పిసు ్త త్వరగా స్వామివారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అదేశాల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెద్ద కోనేరు నుండి మెట్ల మార్గంలో చలువ పందిర్లు వేసి దేవాలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం ప్రత్యేకంగా పులిహోర ప్రసాదాలు అందజేశారు. రాత్రి జాగరణ సందర ్భంగా రేలా రేలా ప్రదర్శన ఏర్పాటు చేశారు, పెద్ద ఎత్తున వచ్చిన భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంచణీయ సంఘటనలు జరగకుండా బనగానపల్లె సిఐలు ప్రవీణ్‌కుమార్,మంజూనాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎస్ఐలు దుగ్గిరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డిలు భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచే రాత్రి వరకు పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సత్రం, రెడ్ల, ఆర్యవైశ్య, యాదవ, లింగబలిజ అన్నదాన సత్రాల వారు భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

# అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్ ను.. ఢీ కొన్న లారీ



**– ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్**

**ఆస్పరి,నవంబరు 17,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామ సమీపాన లారీ అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ట్రాన్స్‌ఫార్మర్ ను ఢీ కొనడంతో మంటలు చెలరేగి ముందు భాగం ధ్గ్ధమైనట్లు సి.ఐ.గంగాధర్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నాం 2.30 గంటల సమయంఓ బళ్ళారి నుంచి కంకర్ లోడుతో 22 చక్రాలు గల ఆర్.జె.51 జేబీ6077 నెంబరు గల లారీ చిన్నహోతూరు లోని స్పీడ్ బేకర్ దగ్గర తన ముందు వెలుతున్న లారీని ఓవర్‌ట్రాక్ చేసేందుకు పోయి అదుపు తప్పి కుడివైపుకున్న పొలంలోకి లారీని తిప్పగా రోడ్ ప్రక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పోల్‌కు ఢీ కొట్టడంతో షార్ట్ సర్క్యూట్ అయి లారీ ఇంజన్ భాగం ఫైర్ కావడంతో మధ్య భాగంలోని 10 టైర్లు పూర్తిగా కాలిపోయాయన్నారు. ఆలూరు ఫైర్ సర్వీస్ వారికి సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో బోయరంగన్న కు చెందిన గడ్డివాము కాలిపోవడంతో ఆయపకు దాదాపు రూ.50 వేలు నష్టం జరిగినట్లు భాధితుడు తెలిపారు.కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు.

# ఘనంగా నేలబిళం తిరునాల



**కొలిమిగుండ్ల, నవంబరు 17, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల పరిధిలోని బందార్లపల్లె సమీపంలో వున్న నేలబిళం మల్లేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక కడ సోమవారం సందర ్భంగా ప్రతి సంవత ్సరం జరిగ తిరునాల ఈసంవత ్సరం కూడ ఘనంగా నిర్వహించారు. ఈతిరునాలలో కోలన్నలు, సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. కార్తీక కడసోమవారం సందర్భంగా మండలంలోని అంకిరెడ్డి పల్లె, కనకాద్రిపల్లె, ఇటిక్యాల, కొలిమిగుండ్ల, చింతలాయపల్లి, అబ్దులాపురం, కోర్నపల్లి, ఉమ్మాయిపల్లె గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించున్నారు. ఈతిరునాలకు కొలిమిగుండ్ల మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వర్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బందార్లపల్లె టీడీపీ నాయకులు కళ్యాన్‌రెడ్డి ఆద్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నిసదుపాయాలు అందించారు. తిరునాల సందర్భంగా కొలిమిగుండ్ల సిఐ రమేష్‌బాబు సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటీ సభ్యులతో బందార్లపల్లెలో గ్రామోత ్సవం నిర్వహించారు.

# భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



**బేతంచెర్ల, నవంబరు 17, ప్రభాతవార్తః**

మండల పరిధిలోని శైవ క్షేత్రాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసంలో చివరి సోమవారం కావడంతో ముక్కోటి దేవతలు ముచ్చటించిన ఆలయంగా పేరొందిన ముచ్చట్ల మల్లిఖార్జునస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుండే భక్తులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు కార్తీక దీపాలను వెలిగించడం జరిగింది. బుగ్గానిపల్లె వద్ద ఉన్న బ్రహ్మసూత్ర నాగేలింగేశ్వరస్వామి ఆలయంలో, భోగేశ్వర ఆలయంలో అలాగే గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు.

# 14 మంది పై పిచ్చికుక్కల దాడి

**: సోమవారం పలు కాలనీలలో విచ్చలవిడిగా మహిళలు చిన్నారులు వృద్ధులపై దాడి**



**ఆత్మకూరు నవంబర్17 ప్రభాతవార్త :**

సోమవారం పట్టణ ప్రజలను పిచ్చికుక్కల దాడిలో 14 మందికి స్వైరవిహారం తీవ్ర భయభ్రాంతులకు గురిచేసింది పట్టపగలే రోడ్లపై తిరుగుతూ, పిచ్చికుక్కలు చిన్నారులు, వృద్ధులు, మహిళలు ప్రజలపై దాడులకు చేస్తున్న అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు

ఒకే ఒక్క రోజులో ఏకంగా 14 మందిని ఈ పిచ్చికుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. గాయపడిన వారందరూ హుటాహుటిన ఆత్మకూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. గతంలో పట్టణంలో ఇటువంటి దాడులు జరిగినప్పటికీ, సంబంధిత మున్సిపల్ అధికారులకు ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోకపోవడంపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలంటే అధికారులకు ఇంత నిర్లక్ష్యమా..? లేక ప్రజల ప్రాణాలు పోయిన పర్వాలేదు అనుకుంటారా ప్రజలు భయాందోళనలో బతకాలా అనే విషయం ఇప్పుడు ఆత్మకూరు పట్టణంలో జోరుగా వినిపిస్తున్నాయి. ప్రజలు పడుతున్న సమస్యల్ని మున్సిపల్ అధికారులు దృష్టిలో ఉంచుకొని పలు కాలనీలలో వెంటనే కుక్కల బెడదను నివారించే విధంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలుడిమాండ్ చేశారు



